జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948
జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక
హైదరాబాద్, విజయవాడ ॥ సంపుటి:1 ॥ సంచిక: 79 ॥ శుక్రవారం ॥ 14-8-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-

శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:02 సూర్యాస్తమయం - సా. 6:39 తిథి పాడ్యమి రా. 8:45 వరకు తరువాత విదియ సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం ఆశ్లేష ఉ. 6:03 వరకు తరువాత పూర్వ ఫల్గుని(పుబ్బ) యోగం వారియ మ. 12:13 వరకు కరణం స్తుష్నమ ఉ. 9:53 వరకు బవ రా. 8:45 వరకు వర్జ్యం సా. 5:22 నుండి సా. 6:52 వరకు దుర్ముహూర్తం ఉ. 10:14 నుండి ఉ. 11:05 వరకు మ. 3:17 నుండి సా. 4:08 వరకు రాహుకాలం మ. 1:55 నుండి మ. 3:30 వరకు యమగండం ఉ. 6:02 నుండి ఉ. 7:36 వరకు గుళికకాలం ఉ. 9:11 నుండి ఉ. 10:46 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:26 నుండి తె. 5:14 వరకు అమృత ఘడియలు తె. 4:36 నుండి ఉ. 6:05 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:55 నుండి మ. 12:46 వరకు గమనిక: “ం” అనగా మరుసటి రోజున

# మైనార్టీ రిజర్వేషన్లు... ఘనత కాంగ్రెస్‌దే

## కొందరు 4 శాతం రిజర్వేషన్లపై కోర్టు మెట్లెక్కారు

### ఇంటింటికీ వెళ్లి ఓట్ల గల్లంతును పరిశీలించండి.. మైనార్టీల ప్రతిభా సదస్సులో సిఎం రేవంత్



ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లిలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

హైదరాబాద్,ఆగస్ట్13: రిజర్వేషన్ల రద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భం గా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మైనారిటీ రిజర్వేషన్లకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యతిరేకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నేతృత్వంలోనే మైనారిటీలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, హిందూ, ముస్లింలను రెండుకళ్లలా చూస్తోందని పేర్కొన్నారు. ఈ తరువాయి 2 వ పేజీలో..



## బిసి మహిళలకు స్వయం ఉపాధి

### ఉచిత కుట్టుమిషన్లు ప్రారంభించిన పొన్నం

హైదరాబాద్,ఆగస్ట్13: బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహించిన తరువాయి 2 వ పేజీలో..



## పదేళ్ల బిఆర్ఎస్.. రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేయండి

### గత పథకాలకు తోడు సంక్షేమాన్ని రెట్టింపు చేసాం

### ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపనలో సిఎం రేవంత్

పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. గతంలో ఉన్న పథకాలకు అదనంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి సీఎం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదల రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని.. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

హైదరాబాద్,ఆగస్ట్13: ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై సీఎం విమర్శలు చేశారు. రాష్ట్రం ఎండిపోవాలని కుట్ర చేశారని ఆరోపించారు. చేతబడుల కోసం కొందరు కర్ణాటక వెళ్లారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు కేసీఆర్ పరిస్థితి ఉంది. అందుకే అల్లుడు క్షుద్రపూజలు చేశారు. మీరు చేసిన చేతబడి మీపైనే తిరగబడి అష్టదిగ్బంధనం చేస్తుంది. ఫాంహౌస్ నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి వస్తుంది. నా తరువాయి 2 వ పేజీలో...



## జగన్ హయాంలో.. గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలు

### అక్రమాలపై ఎక్కడికక్కడ నిలదీయండి.. చంద్రబాబు దిశానిర్దేశం

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 మూల్యాంకనంతో వైసీపీ అడ్డంగా దొరికిపోయిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తమ వారికి ఉద్యోగాలు ఇప్పించుకునేందుకు అర్హులను బలి చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

అమరావతి,ఆగస్ట్13: ఈ సందర్భంగా గ్రూప్-1 అంశం చర్చకు వచ్చింది. గ్రూప్-1 మూల్యాంకనంలో 97 శాతం జవాబు పత్రాలు దిద్ది ఉండటంపై సీఎం చంద్రబాబు, మంత్రులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లతో జవాబు పత్రాలు దిద్దించడంపై పలు పత్రికలు, ఛానళ్లలో వచ్చిన వార్తలను చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారని సీఎంకు మంత్రులు వివరించారు. ఈ సందర్భంగా త్వరలో జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లోనూ గ్రూప్-1 వ్యవహారంపై వైసీపీని ఎండగట్టాలని సీఎంను కోరారు. సిట్ ఇచ్చిన తరువాయి 2 వ పేజీలో..




## ఏనుగుల సంరక్షణలో ఏపీకి జాతీయ గుర్తింపు

### కుంకీ ఏనుగులతో అద్భుత ఫలితాలు.. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

మానవులు, వన్యప్రాణుల మధ్య సంఘర్షణ లేకుండా సహజీవనం సాగడం అత్యున్నత లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్‌తో కలిసి పాల్గొన్న ఆయన, రాష్ట్రంలో ఏనుగుల సంరక్షణ కోసం చేపడుతున్న చర్యలను వివరించారు.

విశాఖపట్నం, ఆగస్టు 13: ఏజెన్సీ ప్రాంతాల్లో గతంలో మదపుటేనుగుల గుంపులు పంటలను ధ్వంసం చేయడం, ప్రజలపై దాడులు చేయడం వల్ల తీవ్ర ఆందోళన నెలకొనేదని పవన్ కళ్యాణ్ తెలిపారు. అటవీ, పర్యావరణ శాఖ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఈ సమస్య పరిష్కారానికే ప్రాధాన్యం ఇచ్చామని చెప్పారు. కర్ణాటక ప్రభుత్వ సహకారంతో నాలుగు కుంకీ ఏనుగులను రాష్ట్రానికి తీసుకువచ్చి ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో మానవ--వన్యప్రాణి ఘర్షణలను గణనీయంగా తగ్గించగలిగామని వెల్లడించారు. దేశంలో ఏనుగుల సంరక్షణకు కేంద్ర తరువాయి 2 వ పేజీలో..



## త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు

### దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

న్యూఢిల్లీ,ఆగస్టు13: దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గి వినియోగదారులకు తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని - 2 వ పేజీలో..



## ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

### వందేమాతరం గీతాలాపనతో లోక్‌సభ వాయిదా

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. గురువారం ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభమైన తర్వాత సభ్యులంతా కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సమావేశానికి ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌తోపాటు సభ్యులంతా హాజరయ్యారు. జాతీయ గేయంలోని ఆరు చరణాలను పూర్తిగా ఆలపించిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. దీంతో వర్షాకాల సమావేశాలు ముగిసినట్లు అయింది.

న్యూఢిల్లీ,ఆగస్టు13: వందేమాతరం గేయాన్ని చట్టపరంగా రక్షణ కల్పించే శాసనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేసిన కొన్ని రోజులకే లోక్‌సభలో ఈ పరిణామం చోటు చేసుకుంది. జాతీయ గేయాన్ని ఆలపించడాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా నిరోధించడం శిక్షార్హమైన నేరమని -2 వ పేజీలో..

శ్వేత

## సంపాదకీయం

**శుక్రవారం 14-8-2026**

# పార్లమెంట్‌ను అపవిత్రం చేశారు!

తిలా పాపం తలా పిడికెడు అన్నట్లుగా.....పార్లమెంటు సమావేశాలు మట్టి కరవడానికి అందరూ బాధ్యులే. 19 రోజుల పాటు ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరించి ఎన్నుకున్న ప్రజలను అవామానానికి గురి చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో వీరిని ఎన్నుకుని పంపితే చట్టసభలను చట్టుబండలు చేస్తున్నారు. సమస్యలను చర్చించకుండా..వ్యక్తిగత ఎజెండాలతో భ్రష్టు పట్టించారు. ఇలాంటి నేతలు ప్రజల సమస్యలు పరిష్కరిస్తా రని, వారి ఆశలను పరిశీలిస్తారని అనుకోవడం బుద్ధితక్కువ తప్ప మరోటి కాదు. చట్టసభల్లో సమస్యలు చర్చించాలి. సమస్యలకు సమాధానాలు రాబట్టాలి. చట్టాలను చేయాలి. కానీ ఇవేవీ జరగకుండా విపక్షాలు అడ్డుకుంటే..అధికార పక్షం చోద్యం చూసింది. దొందూ దొందే అన్నచందంగా సమావేశాలు సాగకుండా 19 రోజుల పాటు నానా రభస సృష్టించారు. చివరి రోజు గురువారం కూడా సభలు సజావుగా సాగక పోవడంతో ఉభయ సభలను నిరవధికంగా వాయిదా వేశారు. మొత్తంగా ఈ 19 రోజులు ప్రతిపక్ష సభ్యుల ఆందోళనల మధ్య ఎటువంటి కార్యకలాపాలు జరగకుండానే వాయిదాపడ్డాయి. దీంతో పార్లమెంటు సమావేశాలు మొదలైన జులై 20 నుంచి ఇప్పటిదాకా 19 రోజులు సభా కార్యకలాపాలు తుడిచిపెట్టుకుపోయాయి. అధికార, ప్రతిపక్షాలు పట్టు వీడకపోవడంతో ఆఖరి రోజూ సజావుగా సాగలేదు. విద్యార్థుల ఆందోళనపై చర్చకు సిద్ధమని బుధవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సవాల్ విసిరారు. చర్చకు ప్రతిపక్షం అంగీకరిస్తే పార్లమెంటు సమావేశా లను పొడిగించడానికి సిద్ధమని కేంద్రం తెలిపింది. అయితే ఆయన లెక్చర్ వినడానికి సిద్ధంగా లేమని ప్రతిపక్షం ఆ సవాల్‌ను తోసిపుచ్చింది. బుధవారం ఉదయం 11గంటలకు లోక్‌సభ సమావేశం కాగానే ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి వచ్చి నినాదాలు చేశారు. చర్చను ప్రారంభిద్దామని మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపాదించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో సభ నిరవధికంగా వాయిదా పడింది. ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉంటే ప్రతిపక్షం పారిపోవడం తొలిసారిగా చూస్తున్నా' అని పార్లమెంటరీ వ్యవహారా మంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యానించారు.

నిజయోకవర్గ సమస్యలను ఎలాగూ ప ట్టించుకోవడం లేదు. అలాగే దేశ సమస్యలపైనా బాధ్యత లేదు. ప్రతిపక్షం బలంగా గళం వినిపిస్తేనే ప్రభుత్వాలు తలవంచుతాయి. ఆందోళన చేయడం కూడా ఓ రకమైన నిరసన అని చెప్పుకుని తప్పించుకోవడం మినహా విపక్షం చేసిందేమీ లేదు. పార్లమెంట్ లోపాలా, బయటా ధర్నాలు చేయడం మినహా సాధించిందేమీ లేదు. దీనికోసం ప్రజలు ఎంపిలను ఎన్నుకోలేదు. విద్యార్థుల ఆందోళనలపై ప్రభుత్వం చర్చకు సిద్ధమని చెప్పడం.. అమిత్ షా ప్రతిష్ఠ అనే గాలి బుడగ పేలిపోయాక దానిలో గాలిని నింపడానికి చేసిన చివరి ప్రయత్నంగా రాహుల్ అభివర్ణించారు. అసలు తమపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరపడానికి ఎవరు ఆదేశించారో తెలుసుకోవాలని యువత కోరుకుంటున్నారని రాహుల్ పట్టుపడుతూ వచ్చారు. అమిత్ షా ఉపన్యాసం వినడానికి సిద్ధంగా లేమని తేల్చి చెప్పారు. విద్యార్థుల ఆందోళనలు, వాటికి సంబంధించిన అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నానని అమిత్ షా తెలిపారు. ప్రతిపక్షాలు చర్చను కోరుతూ లోక్‌సభ స్పీకరుకు లేఖ ఇవ్వాలని, వారు అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. మొత్తం చర్చలో తాను పాల్గొంటానని తేల్చి చెప్పారు. చర్చ నుంచి తాను పారిపోతున్నా నన్న ప్రతిపక్షాల ఆరోపణలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

అనంతరం ఆయన స్పీకర్‌కు లేఖ రాశారు. ప్రతిపక్షాలతో సంప్రదించి విద్యార్థుల ఆందోళనలపై చర్చ చేపట్టాలని కోరారు. కానీ విపక్షం చర్చకు సిద్ధంగా లేదని తేలిపోయింది. కేవలం బలప్రదర్శన వేదికగా వర్షాకాల సమావేశాలు నిలిచాయి. విపక్షాలు బంలగా ఉన్నాయని చాటి చెప్పడానికి ప్రయత్నించారు. ప్రధానంగా విదేశీ విరాళాల సవరణ బిల్లును అడ్డుకోవడం కోసం చేసిన ప్రయత్నం ఫలించింది. ప్రజలు ఇప్పుడు ఆలోచించాల్సిన సమయం వచ్చింది. ఉభయ సభలు ఈ వర్షాకాల సమావేశాల్లో సజావుగా జరగకూడదన్న విపక్షం ఎజెండా విజయం సాధించింది. పార్లమెంటులో విపక్షాల నినాదాలు, పోడియంలోకి దూసుకుని రావడం, స్పీకర్ ఓంబిర్లా వారించడం నిత్యకృత్యంగా మారాయి. దీంతో సమావేశాలను విపక్ష పార్టీలు కావాలనే స్తంభింపచేసాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే అధికార పార్టీ సభ్యులు కూడా ఈ సమావేశాల్లో మకరద్వారం వద్ద ప్రతిపక్షాలను నిలదీస్తూ 'రాహుల్ గాంధీ జవాబ్ దో..' అని నినాదాలు చేశారు. అయితే ఇవేవీ ప్రజలకు ఉపయోగపడే వ్యవహారాలు కావు. అటు అధికార పార్టీ, ఇటు విపక్ష పార్టీలు రెండూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయనడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదు. నినాదాలు చేస్తున్న పాలక, ప్రతిపక్ష సభ్యుల తీరును ప్రజలు గమనించారు. ఎవరేంటో తెలుసుకుంటున్నారు. వీరితీరుపైనా జెన్‌జీలు దృష్టి సారించాలి. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న నాయకులను కనిపెట్టాలి. లేకుంటే పార్లమెంట్ సమావేశాలకు అర్థం లేకుండా పోతుంది. ఇలా 19 రోజులు సభలను వృధా చేసినందుకు నేతల జీతభత్యాలను కట్ చేయాలి. వారికి తగిన ఫైన్ వేయాలి. అప్పుడే నేతల్లో జవాబుదారీతనం వస్తుంది.

# వేలం వెర్రిగా భూముల అమ్మకం

**ప్రభుత్వ భూముల జాడలేకుండా మాయం**

**రాయదుర్గం భూ వేలాన్ని వెంటనే ఆపాలి**

**సిఎం రేవంత్‌కు హరీష్ రావు లేఖ**



హైదరాబాద్,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ఎక్కడ పడితే అక్కడ భూముల అమ్మకాలు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. భూముల అమ్మకాలపై ప్రశ్నలు సంధిస్తూ సీఎంకు హరీశ్ లేఖ రాశారు. 'ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపిస్తే అక్కడ అమ్మకాలేనా? నాడు ప్రభుత్వ భూములు పెద్దలు ఇచ్చిన జాతి సంపద అని ఉపన్యాసాలు దంచిన నువ్వు.. నేడు ఎక్కడ భూములు కనిపిస్తే అక్కడ వేలం వేస్తూ, ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడుతున్నావు' అంటూ ఫైర్ అయ్యారు. కంచ గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ నేడు రాయదుర్గ్ ఇలా ఎక్కడిక్కడ భూములు అమ్మే కుట్రలు చేస్తుండటం సిగ్గుచేటని మాజీ మంత్రి మండిపడ్డారు. రాయదుర్గ్ పన్మక్త గ్రామంలోని సర్వే నం.83/1లో 10.63 ఎకరాల హెరిటేజ్ భూమిని ఆగస్టు 17, 21 తేదీల్లో వేలం వేయడానికి సిద్ధం కావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2020లో ఇదే భూములపై రక్షణ కోరుతూ రేవంత్ కోర్టు మెట్లు ఎక్కారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాటనా అని ప్రశ్నించారు. హెరిటేజ్ భూములను కాపాడాల్సిన ప్రభుత్వం.. వాటినే వేలం వేసి అమ్మేందుకు ఎందుకు తొందరపడుతోందని నిలదీశారు. ఇదే సర్వే నంబర్‌లో గతంలో 6.2 ఎకరాలు సుమారు ఎకరాకు 237 కోట్ల చొప్పున వేలం వేస్తే, ఎస్‌బీఐ కోర్టుకు ఎక్కిందని... ప్రస్తుతం ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని వెల్లడించారు. అయినా, అదే సర్వే నంబర్‌లో మరో 10.63 ఎకరాలను వేలం వేయడం వెనుక ఆంతర్యం ఏమిటని.. న్యాయ వ్యవస్థ అంటే గౌరవం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూమిపై అనేక వివాదాలు ఉన్నాయని.. భూమి ఎవరిదో తేల్చకుండా వేలం వేయడం ఎందుకన్నారు. భూమి ఎవరిదో తేల్చలేని ప్రభుత్వం.. భూమిని అమ్మడానికి మాత్రం ఎందుకు తొందరపడుతోందని అడిగారు. రూ.2,000 కోట్ల విలువైన హెరిటేజ్ భూములను అమ్మే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారంటూ మండిపడ్డారు. నాడు పీసీసీ అధ్యక్షుడిగా ప్రభుత్వ భూములను తెలంగాణ జాతి సంపదగా అభివర్ణించిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారని..' ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోము' అన్న హామీ ఏమైందని నిలదీశారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ భూములను అమ్మబోమని చెప్పిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాటలకు విలువ లేదా అని అన్నారు. భూముల వేలంపై రేవంత్ రెడ్డి వైఖరి చూస్తుంటే ఊసరవెల్లి కూడా సిగ్గుపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సుప్రీంకోర్టు కూడా ఆస్తిని పరిరక్షించడం, కొత్తగా ఆస్తి సృష్టించకుండా చూడాల్సిన అవసరాన్ని స్పష్టం చేసిందని హరీశ్ గుర్తుచేశారు. అలాంటి పరిస్థితుల్లో వివాదాస్పద భూమిని వేలం వేసి కొత్త హక్కులు సృష్టించడం ఏ విధమైన పరిపాలనా బాధ్యత అని ప్రశ్నించారు. ఆగస్టు 17, 21 తేదీల్లో జరగనున్న వేలాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే సర్వే నం.83కు సంబంధించిన హెరిటేజ్, రెవెన్యూ, సర్వే, వక్ఫ్ రికార్డులన్నింటినీ బయటకు తీసి సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలు నిగ్గు తేల్చాలన్నారు. హక్కులు, వివాదాలు తేలకముందే ఈ భూములను కొనుగోలు చేస్తే.. భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్ తరాలకు అందించాల్సిన విలువైన హెరిటేజ్ భూములను అమ్మాలని చూడటం దారుణమని మాజీ మంత్రి అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారిలా కాకుండా.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వ్యవహరించాలని హితవుపలికారు. అనుముల బ్రదర్స్ ప్రయోజనాల కోసం కాదని.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, తెలంగాణ ప్రయోజనాలను కాపాడే ముఖ్యమంత్రిగా ఉండాలని... లేదంటే చరిత్ర హీనుడిగా మిగిలిపోతారని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు.

# లష్కరే చీఫ్ హాఫీజ్ సయీద్‌కు పాక్ అండ

**పాక్‌వైపు కన్నెత్తితో భారత్ సర్వనాశనం తప్పదు**

**అవామీ ముస్లిం లీగ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్ ప్రేలాపన**

న్యూఢిల్లీ,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): పంద్రాగస్టు వేడుకలను రెండు రోజుల్లో భారత్ జరుపుకోనుంది. అలాంటి వేళ.. నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కర్ ఎ తైబా చీఫ్‌పై పాకిస్థాన్ మాజీ మంత్రి, అవామీ ముస్లిం లీగ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్ ప్రశంసల వర్షం కురిపించారు. అలాగే భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. లష్కర్ ఎ తైబా చీఫ్ హాఫీజ్ సయీద్‌కు తాను సేవకుడిని ఆయన ప్రకటించారు. హాఫీజ్ సయీద్ వెంట పాకిస్థాన్‌తోపాటు తాము ఉన్నామని ఈ సందర్భంగా ప్రకటించారు. పాకిస్థాన్ వైపు కనీసం కన్నెత్తి చూస్తే భారత్‌ను అల్లా నాశనం చేస్తారని హెచ్చరించారు. ఆ దేశంలో పక్షుల కిలకిలారావాలు వినపడవని అన్నారు. దేవాలయాల్లో గుడి గంటలు కూడా మోగవని తీవ్ర స్వరంతో పాక్ మాజీ మంత్రి పేర్కొన్నారు. భారత్‌లో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఏం జరగదని ఆయన అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్నప్పుడు తన ఫోన్‌లో హాఫీజ్ సయీద్ ఫోన్ నెంబర్‌ను అధికారులు గుర్తించారని చెప్పారు. దీంతో ఆ దేశం నుంచి తనను బహిష్కరించారని ఈ సందర్భంగా పాక్ మాజీ మంత్రి షేక్ రషీద్ అహ్మద్ గుర్తు చేసుకున్నారు. బహిరంగ సభలో షేక్ రషీద్ చేసిన ఈ వ్యాఖ్యల వీడియో వైరల్ అవుతోంది. లష్కర్ ఎ తైబా సీనియర్ కమాండర్, పాకిస్థాన్ మార్కజీ ముస్లిం లీగ్ అధ్యక్షుడు ఖాలీద్ మసూద్ సంధుతోపాటు ఆ సంస్థ కేంద్ర సలహా కమిటీ సభ్యుడు ఖారీ మొహమ్మద్ యాకూబ్ షేక్ సమక్షంలో పాక్ మాజీ మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు షేక్ రషీద్ అహ్మద్ ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. 2020 నుంచి 2022 వరకు ఇమ్రాన్ క్యాబినెట్‌లో దేశ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రిగా పని చేశారు. అవామీ ముస్లిం లీగ్‌ను షేక్ రషీద్ స్థాపించారు.

# ఓటరు ధృవీకరణను మరింత ఫ్రెండ్లీగా మార్చాలి

**ఎన్నికల సంఘానికి వైసిపి నేత లేళ్ల అప్పిరెడ్డి లేఖ**

అమరావతి,ఆగస్ట్13: ఓటర్ల ధృవీకరణ ప్రక్రియను మరింత ఓటర్ ఫ్రెండ్లీగా మార్చాలని వైఎస్సార్‌సీపీ భారత ఎన్నికల సంఘాన్ని కోరింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు లేఖ రాశారు. అన్‌మ్యాప్‌డ్, మిస్‌మ్యాచ్‌డ్ ఓటర్ల ధృవీకరణలో పలు కీలక మార్పులు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఓటరు స్వయంగా హాజరు కాలేని పరిస్థితుల్లో తల్లిదండ్రులు లేదా రక్త సంబంధీకుల ద్వారా అవసరమైన పత్రాలను సమర్పించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఉద్యోగం, చదువు, వలస కూలీలుగా ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లకు కూడా వెసులుబాటు కల్పించాలని సూచించారు. ఓటరు తరఫున పత్రాలు సమర్పించే బంధువులకు రిలేషన్‌షిప్ ప్రూఫ్, అధికారిక అనుమతితో అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే వెరిఫికేషన్ నోటీసుల్లో ధృవీకరణ జరిగే ప్రదేశం, తేదీ, సమయం, సంబంధిత అధికారి వివరాలను స్పష్టంగా పేర్కొనాలని వైఎస్సార్‌సీపీ కోరింది. వెరిఫికేషన్ ప్రదేశం వివరాలు లేకుండా నోటీసులు జారీ చేయడం వల్ల ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అభ్యంతరం వ్యక్తం చేసింది. బూత్ లెవల్ ఆఫీసర్ల ద్వారా స్థానికంగానే ఓటర్ల ధృవీకరణకు అవకాశం కల్పించాలని, పత్రాల స్వీకరణతో పాటు ప్రాథమిక, ఫీల్డ్ వెరిఫికేషన్‌లోనూ వారిని భాగస్వామ్యం చేయాలని సూచించింది. ప్రతి ఓటరు ఉన్నతస్థాయి ఎన్నికల అధికారిని వ్యక్తిగతంగా కలవాల్సిన అవసరం లేకుండా స్థానిక స్థాయిలోనే సమస్యలను పరిష్కరించే వ్యవస్థ ఉండాలని కోరింది. ఇదిలా ఉండగా, సర్ ప్రక్రియలో గన్నవరం నియోజకవర్గంలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కూడా చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు లేఖ రాశారు. బూత్‌ల వారీగా 32,524 మంది ఓటర్ల జాబితాను సమర్పించలేదని ఆయన పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలంలోని 24 నుంచి 70 వరకు ఉన్న పోలింగ్ స్టేషన్లలో పునఃపరిశీలన లేదా ఆడిట్ ఎందుకు జరగలేదో వివరించలేదని వంశీ తన లేఖలో పేర్కొన్నారు. ప్రసాదంపాడులోని 58, 59, 53 పోలింగ్ స్టేషన్లలో 'నో మ్యాపింగ్' కేసులు అసమానంగా ఉన్నాయని తెలిపారు. ఓటర్ల ధృవీకరణకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని వైఎస్సార్‌సీపీ కోరింది.

### ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా

# అనుబంధ సంస్థ

**ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడి**

న్యూఢిల్లీ,ఆగస్ట్13: ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ ఉగ్రవాద సంస్థ అల్‌ఖైదా ఇన్ ఇండియన్ సబ్‌కాంటినెంట్ కుట్ర ఉందని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించినట్లు సమాచారం. 2025 నవంబర్‌లో ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనపై దర్యాప్తు నేపథ్యంలో ఈ అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆల్‌ఖైదా ప్రాంతీయ కార్యకలాపాలను విస్తరిస్తున్న ఉగ్రవాద సంస్థగా నివేదిక పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల నుంచి మద్దతు, ఆశ్రయం లభిస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి నివేదికలో ప్రస్తావించినట్లు సమాచారం. దీంతో పలు ప్రాంతాల్లో అల్‌ఖైదా నెట్‌వర్క్ మరోసారి బలపడుతున్నదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా భారత్ సహా ఆయా దేశాల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు అల్‌ఖైదా ముప్పుగా మారే అవకాశం ఉందని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. 2025 నవంబర్‌లో ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన కుట్ర, ఉగ్రవాద నెట్‌వర్క్‌పై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి నివేదికలోని అంశాలు కీలకంగా మారాయి. అల్‌ఖైదా తన కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రాంతీయ నెట్‌వర్క్‌లను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోందని నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల మద్దతుతో పలు ప్రాంతాల్లో సురక్షిత స్థావరాలు లభిస్తున్నాయనే ఆరోపణలు కూడా ఈ నివేదికతో మరోసారి చర్చకు వచ్చాయి. ఉగ్రవాద సంస్థల కదలికలను నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఢిల్లీ పేలుళ్ల కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే కొద్దీ ఈ అంతర్జాతీయ ఉగ్రవాద నెట్‌వర్క్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# ఆదర్శంగా నిలిచిన రాజ్యసభ ఎంపి విజయ్

**తొలి వేతనాన్ని ఆర్మీ జవాన్ల సంక్షేమానికి అందచేత**

న్యూఢిల్లీ,ఆగస్ట్13: రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ గొప్ప మనసును చాటుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు. అమరులైన ఆర్మీ జవాన్ల కుటుంబాలకు ఎంపీ అండగా నిలిచారు. ఎంపీగా తనకొచ్చిన మొదటి నెల జీతం మూడు లక్షల రూపాయలను దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరులైన ఆర్మీ జవాన్ల కుటుంబాల సంక్షేమం కోసం విరాళంగా అందించారు. ఈ విరాళం చెక్కును భారత కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు విజయ్ స్వయంగా అందజేశారు. దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తూ, ప్రాణత్యాగాలు చేసిన సైనికుల కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని.. అందులో భాగంగానే ఈ చిరు సాయం చేసినట్లు విజయ్ స్పష్టం చేశారు.



# దేశభక్తి స్ఫూర్తితో విజయవాడలో ఘనంగా..
# 'హర్ ఘర్ తిరంగ' ర్యాలీ



**త్రివర్ణ పతాకాలతో శోభాయమానంగా మారిన విజయవాడ జిల్లా కేంద్రం**

**'భారత్ మాతా కీ జై', 'వందేమాతరం' నినాదాలతో మార్మోగిన బందరు రోడ్డు**

**భారీగా తరలివచ్చిన విద్యార్థులు, యువత, క్రీడాకారులు, అధికారులు, ప్రజలు**

విజయవాడ: ఆగస్టు 13,2026.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని దేశభక్తి, జాతీయ సమైక్యత, దేశంపై మమకారాన్ని చాటుతూ విజయవాడ జిల్లా కేంద్రంలో గురువారం 'హర్ ఘర్ తిరంగ' కార్యక్రమంలో భాగంగా భారీ తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ఆదేశాల మేరకు స్థానిక కలెక్టరేట్ నుంచి ఇందిరాగాంధీ స్టేడియం వరకు సాగిన ఈ ర్యాలీ దేశభక్తి స్ఫూర్తిని చాటుతూ ఉత్సాహభరితంగా కొనసాగింది.

జాతీయ జెండాలను చేతబూనిన విద్యార్థులు, యువత, క్రీడాకారులు, వివిధ శాఖల అధికారులు, పోలీస్ సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. దీంతో విజయవాడ నగరంలోని ప్రధాన రహదారులు త్రివర్ణ పతాకాలతో శోభాయమానంగా మారాయి. బందరు రోడ్డుపై ర్యాలీ సాగుతున్న సమయంలో "భారత్ మాతా కీ జై", "వందేమాతరం" నినాదాలతో జిల్లా కేంద్రం మార్మోగింది. పాల్గొన్న ప్రతి ఒక్కరూ జాతీయ జెండా పట్ల గౌరవాన్ని, దేశం పట్ల తమ బాధ్యతను చాటుతూ దేశభక్తిని నూతనోత్సాహంతో ప్రదర్శించారు. కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన తిరంగా ర్యాలీ ప్రధాన రహదారుల మీదుగా ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగి ఇందిరాగాంధీ స్టేడియం వరకు చేరుకుంది. చేతుల్లో జాతీయ జెండాలు, హృదయాల్లో దేశభక్తి నింపుకుని విద్యార్థులు, యువత, క్రీడాకారులు, అధికారులు, పోలీసులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా వినిపించిన దేశభక్తి నినాదాలు యువతలోనూ, విద్యార్థుల్లోనూ జాతీయ స్ఫూర్తిని నింపాయి. జాతీయ పతాకం కేవలం ఒక జెండా మాత్రమే కాదని, దేశ స్వాతంత్ర్యం, త్యాగం, ఐక్యత, గౌరవానికి ప్రతీకగా ప్రతి ఒక్కరూ గుర్తించాలని కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు నిర్వహించిన ఈ తిరంగా ర్యాలీ విజయవాడ జిల్లా కేంద్రంలో దేశభక్తి వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చింది. జాతీయ సమైక్యత, దేశభక్తి, బాధ్యతాయుత పౌరసత్వం వంటి విలువలను ప్రజల్లో మరింత బలోపేతం చేసేలా కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ మాట్లాడుతూ, 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్యం



సాధించేందుకు మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. 'పార్ట్నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమం ద్వారా అన్ని రంగాల ప్రజలను జాతీయ నిర్మాణంలో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాబోయే 21 సంవత్సరాల్లో తమ గ్రామం, ఊరు, పట్టణం, రాష్ట్రం, దేశం ఎలా ఉండాలనే దానిపై ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే లక్ష్యాలను నిర్దేశించుకుని, ఆ లక్ష్య సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయుల స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దేశ అభివృద్ధి, సమాజ ప్రగతిలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్.వి. రాజశేఖర్ బాబు మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన తిరంగా ర్యాలీ ప్రజల్లో దేశభక్తి, జాతీయ సమైక్యతా భావాన్ని మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది, క్రీడాకారులు, విద్యార్థినీ విద్యార్థులు, యువత, ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**




విజయవాడ: ఆగస్టు 13, 2026: వెలగపూడి సచివాలయం 5వ బ్లాక్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో పోలింగ్ కేంద్రాలు, ఓటరు నమోదు, ఫారం-6, 7, 8లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. విజయవాడ జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, ఎలక్షన్ సెల్ పర్యవేక్షకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. 18--20 ఏళ్ల మధ్య యువత ఓటరుగా నమోదు చేసుకునేలా కళాశాలలు, విద్యాసంస్థల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించి ఫారం-6 సమర్పించేలా ప్రోత్సహించాలని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సూచించారు. మహిళలు, వయోవృద్ధులు, వికలాంగులు, కొండ ప్రాంతాల ప్రజలను చిన్న చిన్న లోపాల కోసం దూరప్రాంత కార్యాలయాలకు పిలిపించకుండా ఇఆర్వో, ఎఇఆర్వో స్థాయిలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఓటర్ల పేర్లు, తల్లిదండ్రుల పేర్లలో అక్షర దోషాల సవరణకు ఈసీఐ నిబంధనలు, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు విచారణ నిర్వహించాలని, 48 గంటలకు పైబడి పెండింగ్‌లో ఉన్న బిఎల్ఓ కాల్స్ నాన్-రెస్పాన్స్ కేసులను, ఎన్జీపిఎస్ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఇసిఐ నెట్ యూజర్ నేమ్, పాస్‌వర్డ్, ఓటీపిల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ డ్రాఫ్ట్ రోల్స్ పబ్లికేషన్ హ్యాండోవర్ పూర్తయిందని, బిఎల్ఓ, బిఎల్ఎస్ సమావేశాల మినిట్స్ అప్‌లోడ్ చేసి నోటీసులు జనరేట్ చేసినట్లు తెలిపారు. నోటీసుల డెలివరీ 57 శాతం పూర్తయిందని పేర్కొన్నారు. ఎస్ఎల్ఎ దాటి పెండింగ్‌లో ఉన్న సుమారు 9 వేలు ఫారం-6, 6 వేలు ఫారం-8 దరఖాస్తులను వేగంగా పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఓటరు నమోదు అవగాహన కోసం ఈ నెల 22, 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 48 గంటలకు పైబడి పెండింగ్‌లో ఉన్న 29 కేసుల్లో కొన్నింటిని ఇప్పటికే పరిష్కరించినట్లు, ఎన్జీపిఎస్ కింద రూ.3 వేలకుపైబడిన మొత్తాలకు సంబంధించి నాలుగు ప్రతిపాదనలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఇఆర్వో లాగిన్‌లో ఆధార్ లింకింగ్ అభ్యర్థనలు పెద్ద సంఖ్యలో ఒకే చోట చేరడంతో పనుల వేగం తగ్గుతోందని, దీనికి సాంకేతిక పరిష్కారం చూపాలని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌ను కోరారు.



## 12 సంవత్సరాలకు వచ్చే అమ్మవారి మహా
# కుంభాభిషేక ఆహ్వానం

నెల్లూరు జిల్లా, 13 ఆగష్టు (డీప్ జూబశ్రీంవ): చిల్లకూరు మండలం తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే మహా కుంభాభిషేకం 24,25,26 తేదీలలో ఎంతో ఘనంగా నిర్వహించబడును. కావున ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించవలసిందిగా దేవస్థానం చైర్మన్ కోరారు.



## న్యూ సాంవ్లి పాఠశాలలో రూ. 12 లక్షలతో నిర్మించిన
# అదనపు గదుల ప్రారంభం

**మెరుగైన వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం: ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**

కుభీర్, ఆగస్టు 13, (డీప్ పల్స్): కుభీర్ మండలంలోని న్యూ సాంవ్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో రూ.12 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను ముధోల్ నియోజకవర్గ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ గురువారం ఘనంగా ప్రారంభించారు. రిబ్బన్ కత్తిరించి నూతన గదులను పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు మెరుగైన విద్యా వసతులు కల్పించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సౌకర్యవంతమైన విద్యా వాతావరణాన్ని అందించేందుకు ఇలాంటి మౌలిక వసతుల కల్పన ఎంతగానో దోహదపడుతుందన్నారు. పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడంతో విద్యార్థుల భద్రత దృష్ట్యా దాని అవసరాన్ని గ్రామస్థులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రామారావు పటేల్, పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణాన్ని మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.



## వత్సవాయిలో రేపు ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం

**జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలి**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశలి**

విజయవాడ: ఆగస్టు 13,2026: "ఒక నెల - ఒక గ్రామం - నాలుగు సందర్శనలు"లి కార్యక్రమంలో భాగంగా జగ్గయ్యపేట నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ఆగస్టు 14వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. వత్సవాయి శ్రీ వాసవి కళ్యాణ మండపంలో ఉదయం 10.00 గంటల నుంచి ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని ప్రజల నుంచి అధికారులు అర్జీలను స్వీకరించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టనున్నారని కలెక్టర్ తెలిపారు. జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు ఈ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ కోరారు.

## దేశభక్తి భావాన్ని పెంపొందించేలా హర్ ఘర్ తిరంగా నిర్వహించాలి

**చిల్లకల్లు జడ్పీ పాఠశాల విద్యార్థులతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**

జగ్గయ్యపేట: ఆగస్టు 13, 2026: స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ భావితరాల్లో జాతీయ సమైక్యత, దేశభక్తి, దేశంపై మమకారాన్ని పెంపొందించేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు జడ్పీ పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని చిల్లకల్లు జడ్పీ పాఠశాల ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని అత్యంత ఉత్సాహంగా, వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు జాతీయ జెండాలను చేతబూని ప్రధాన వీధుల గుండా ర్యాలీగా కదిలారు. విద్యార్థులు, యువత, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తిని చాటారు. జాతీయ జెండాలను చేతబూని విద్యార్థులు క్రమశిక్షణతో ర్యాలీలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# స్వయం సహాయక సంఘాలకు ఏపీ ప్రభుత్వం గుడ్ న్యూస్

**10 మంది నిబంధన సడలింపు**

**8 మంది సభ్యులున్నా రిపీట్ డోస్ లబ్ధి**

**పొదుపు సంఘాలకు సులభంగా బ్యాంక్ రుణాలు**

**ఏపీ గ్రామీణ బ్యాంక్‌కు మంత్రి కొండపల్లి అభినందనలు**



అమరావతి, ఆగస్టు 13 : స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) మహిళలు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తూ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో ప్రశంసించారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో సభ్యుల మరణం లేదా వలసల వల్ల ఒక సంఘంలో సభ్యుల సంఖ్య 10 కంటే తగ్గితే, ఆ సంఘాలు ఎంత బాగా పనిచేసినా తదుపరి రుణ సదుపాయం (రిపీట్ డోస్) పొందేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదని... ఈ క్రమంలోనే ఏపీ గ్రామీణ బ్యాంక్ తమ అంతర్గత ఉత్తర్వులు నెంబర్ 152 ద్వారా ప్రత్యేక సడలింపులు ప్రకటించడం అభినందనీయమని మంత్రి కొనియాడారు. అలాగే కొత్త మార్గదర్శకాల ప్రకారం కనీసం 8 మంది యాక్టివ్ సభ్యులు ఉన్న సంఘాలకు రిపీట్ డోస్ రుణం మంజూరు చేస్తారని... అయితే సభ్యుల సంఖ్య తగ్గడానికి వలసలు లేదా మరణం మాత్రమే కారణమై ఉండడంతో పాటు... అక్రమాలు లేకుండా.. పాత బకాయిలు లేకుండా సక్రమమైన చెల్లింపులు ఉండాలని కూడా మంత్రి సూచించారు. అర్హత గల సంఘాలు ప్రత్యేక తీర్మానం మరియు బాధ్యతా పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందన్నారు. రుణ సడలింపు పొందిన సంఘాలు 6 నెలల వ్యవధిలో తమ సభ్యుల సంఖ్యను మరల కనీసం 10 మందికి పెంచుకోవాలని కూడా మంత్రి తెలిపారు. మహిళలకు ఇచ్చే రుణం ఒక ఆర్థికసాయం మాత్రమే కాదని.. వారి జీవనోపాధి, స్వయం ఉపాధికి, మహిళల ఆర్థిక సాధికారతకు నిదర్శనం అన్నారు. రాష్ట్రంలోని మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసి, ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్తను తయారు చేయడమే ప్రభుత్వం యొక్క ముఖ్య లక్ష్యమని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇదే రీతిలో స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్బీసీ) మరియు రాష్ట్రంలో ఉన్న ఇతర బ్యాంకులు కూడా ముందుకు వచ్చి, మంచి రికార్డు ఉన్న స్వయం సహాయక సంఘాలకు 10 మంది నిబంధనను సడలించి, సులభంగా రుణ పునరుద్ధరణ సహాయం అందించాలని మంత్రి కొండపల్లి పిలుపునిచ్చారు.

# ఎలినో ప్రభావాన్ని అందరం కలిసికట్టుగా ఎదుర్కొందాం

**లినూరు శాతం పంటల బీమా చేయించేందుకు వ్యవసాయ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలిలి**

**... జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశలి**



జగ్గయ్యపేట: ఆగస్టు 13, 2026: ఎలినో ప్రభావాన్ని అందరం కలిసికట్టుగా ఎదుర్కొంటూ రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పంటల బీమా ద్వారా రైతులకు భరోసా కల్పించేలా వ్యవసాయ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జగ్గయ్యపేట వ్యవసాయ శాఖ అధికారులు గురువారం ధర్మవరప్పాడు తండా జెండా చెట్టు వద్ద ఏర్పాటుచేసిన రైతన్న మీకోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పాల్గొన్నారు.

మీ సందర్భంగా చెట్టు కింద కూర్చుని రైతులతో ముచ్చటించారు. రైతుల సాగు పరిస్థితులు, నీటి లభ్యత, పంటల సాగు, ఎరువుల లభ్యత తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. దేశవ్యాప్తంగా నెలకొన్న ఎలినో ప్రభావం వల్ల వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని రైతులకు వివరించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని రైతులకు సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా, జాగ్రత్తగా వినియోగించుకోవాలని తెలిపారు. రైతులు పంటల సాగులో వైవిధ్యాన్ని పాటించాలని కలెక్టర్ సూచించారు. నీటి లభ్యత, నేల స్వభావం, మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఉద్యానవన పంటలను సాగు చేయడం ద్వారా ఆర్థికంగా మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారులు రైతులకు పంటల ఎంపిక, సాగు పద్ధతులు, నీటి వినియోగం తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో అవసరమైన సలహాలు అందించాలని సూచించారు. ఆగస్టు 15వ తేదీతో ఫసల్ బీమా యోజన ఇన్సూరెన్స్ నమోదు గడువు ముగియనున్నందున, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. ముఖ్యంగా వరి, మిర్చి, పెసర, మొక్కజొన్న పంటలు సాగు చేసిన రైతులందరూ క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. పంటలకు అనుకోని నష్టం సంభవించినప్పుడు బీమా రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని తెలిపారు. జిల్లాలో అర్హులైన రైతులందరికీ పంటల బీమా కల్పించేలా వ్యవసాయ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. బీమా నమోదు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి రైతు బీమా పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో జి.అనిల్ కుమార్, జగ్గయ్యపేట ఏడీఏ సి.భవాని, డిప్యూటీ తహసిల్దార్ పి.మనోహర్, డిప్యూటీ ఎంపీడీవో, ఆర్ఎస్కే సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## సోషల్ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థులకు బ్లాంకెట్స్ పంపిణీ

చింతలపూడి. ఆగస్టు 14,:ఏలూరు జిల్లా చింతలపూడి లోని సోషల్ వెల్ఫేర్ ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థులకు బ్లాంకెట్, టవల్, స్వెటర్, నైట్ డ్రెస్ ఉన్న కిట్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే రోషన్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం, విద్య పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, విద్యార్థులకు కావలసిన అన్ని రకాల వసతులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, కాబట్టి వాటిని ఉపయోగించుకొని విద్యార్థులు చక్కటి విద్యను అభ్యసించి భవిష్యత్తులో అత్యున్నత శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన తిరంగా ర్యాలీ లో పాల్గొన్నారు. 80 వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ తిరంగా ర్యాలీని ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయులు చక్రధర్ రావు తెలిపారు. కార్యక్రమంలో డివైఈవో పీఎస్ సుధాకర్, స్కూల్ సిబ్బంది, కూటమి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాలు చిన్నారులకు మంచి భవిష్యత్తును అందించాలి

**పౌష్టికాహార లోపం లేకుండా చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి**

**వయసుకు తగ్గ బరువు లేని పిల్లలపై నిరంతర పర్యవేక్షణ అవసరం**

**తల్లిదండ్రులకు పోషకాహారంపై అవగాహన కల్పించాలి**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**

జగ్గయ్యపేట: ఆగస్టు 13,2026: అంగన్వాడి కేంద్రాలు చిన్నారుల సమగ్ర అభివృద్ధికి పునాదిగా నిలిచి, వారికి మంచి భవిష్యత్తును అందించేలా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వయసుకు తగ్గ బరువు లేని పిల్లలను గుర్తించి వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గురువారం జగ్గయ్యపేట మండలం ధర్మవరపుపాడు తండా సక్షం అంగన్వాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు అందుబాటులో ఉంచిన సౌకర్యాలు, పౌష్టికాహార కార్యక్రమాల అమలు, విద్యాబోధన, ఆటపాటల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. అంగన్వాడి కేంద్రానికి అందజేసిన టీవీ, ఆర్వో ప్లాంట్, పెయింటింగ్స్, ఆట వస్తువులు తదితరాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వాటిని చిన్నారుల అవసరాలకు అనుగుణంగా సక్రమంగా వినియోగిస్తున్నారా అనే విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో చేపడుతున్న కార్యక్రమాలు, చిన్నారులకు అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. వయసుకు తగ్గ బరువు లేని చిన్నారుల వివరాలను సంబంధిత యాప్‌లో జిల్లా కలెక్టర్ పరిశీలించారు. యాప్‌లో నమోదైన వివరాలకు అనుగుణంగా చిన్నారుల బరువును స్వయంగా తూయించి క్రాస్ చెక్ చేశారు. పిల్లల ఎదుగుదల, బరువు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులతో జిల్లా కలెక్టర్ కొద్దిసేపు సరదాగా ముచ్చటించారు. వారు నేర్చుకున్న పాటలను చిన్నారులతో పాడించి, వారిని ఉత్సాహపరిచారు. ఆటపాటల ద్వారా పిల్లల్లో ఆసక్తి, ఆత్మవిశ్వాసం పెంపొందేలా అంగన్వాడి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.





ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ, చిన్నారుల బాల్య దశలో ఆటపాటలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ఈ వయసులో పిల్లలకు ఆటలు, పాటలు, విద్యాబోధనను సమన్వయం చేస్తూ అందిస్తే వారు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. అంగన్వాడి కేంద్రాలు చిన్నారుల్లో సృజనాత్మకత, నేర్చుకునే ఆసక్తి, సామాజిక నైపుణ్యాలను పెంపొందించే కేంద్రాలుగా పనిచేయాలని సూచించారు. వయసుకు తగ్గ బరువు లేని పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాంటి పిల్లలను గుర్తించి వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు, వారి తల్లిదండ్రులకు కూడా పిల్లలకు అందించాల్సిన పోషకాహారం, సమతుల్య ఆహారం గురించి అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం నాణ్యత, పరిమాణం, పంపిణీ తదితర అంశాలను పర్యవేక్షించాలని, బాలామృతం సక్రమంగా అందిస్తున్నారా లేదా పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అంగన్వాడి కేంద్రం ఆవరణలో మొక్కను నాటారు. పర్యావరణ పరిరక్షణపై చిన్నారుల్లో అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో నందిగామ ఆర్డీవో జి.అనిల్ కుమార్, డిప్యూటీ తహసిల్దార్ పి.మనోహర్, ఎంపీడీవో, సీడీపీఓ జి.సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.






# నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు

**... జిల్లా ఉపాధి మరియు నైపుణ్య అధికారి సి.మధుభూషణ్ రావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు**

విజయవాడ: ఆగస్టు 13, 2026. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్డీసీ) ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆగస్టు 14,2026 శుక్రవారం కంపెనీ స్పెసిఫిక్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి మరియు నైపుణ్య అధికారి సి.మధుభూషణ్ రావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు తెలిపారు.

ఆగస్టు 14న ఉదయం 9.00 గంటలకు విజయవాడ గాయత్రీ నగర్‌లోని ఆధ్యా స్టోర్, పాత ఎస్బిఐ బ్రాంచ్, జూడియో స్టోర్స్ ఎదురుగా, ఘంటసాల వారి స్ట్రీట్ నందు కంపెనీ స్పెసిఫిక్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ డ్రైవ్‌కు హాజరయ్యే అర్హత కలిగిన అభ్యర్థులకు కంపెనీ ప్రతినిధుల ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి, ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఈ ఉద్యోగ అవకాశాలకు ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ విద్యార్హత కలిగి, 18 సంవత్సరాల నుంచి 29 సంవత్సరాలలోపు వయస్సు గల యువతీ యువకులు అర్హులని అధికారులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగాన్ని బట్టి నెలకు రూ.15,000 నుంచి రూ.25,000 వరకు వేతనంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించే అవకాశం ఉందని వెల్లడించారు. ఆసక్తి మరియు తగిన అర్హతలు కలిగిన అభ్యర్థులు కంపెనీ స్పెసిఫిక్ డ్రైవ్‌కు హాజరయ్యే ముందు ఏపీఎస్ఎస్డీసీ నైపుణ్యం పోర్టల్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు సూచించారు. అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో నమోదు చేసుకోవడానికి:

https://naipunyam.ap.gov.in/user-registration లింక్‌ను వినియోగించుకోవాలని తెలిపారు.

కంపెనీ స్పెసిఫిక్ డ్రైవ్‌కు హాజరయ్యే అభ్యర్థులు రెజ్యూమ్ లేదా బయోడేటా ఫారంతో పాటు కింది పత్రాల జిరాక్స్ కాపీలను తీసుకురావాలని అధికారులు సూచించారు: ఆధార్ కార్డు కాపీ, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నంబర్, పాన్ కార్డు కాపీ, విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, రెజ్యూమ్ లేదా బయోడేటా.

జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి మరియు నైపుణ్య అధికారులు కోరారు. ఉద్యోగ ఎంపిక ప్రక్రియలో భాగంగా నిర్వహించే ఇంటర్వ్యూలకు అభ్యర్థులు నిర్ణీత సమయానికి అవసరమైన పత్రాలతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 81259 73743, 99857 59304, 93477 79032 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.




## కోయిల్ సాగర్ నీటిని విడుదల చేయాలని మరికల్ లో ధర్నా

మరికల్ 13 ఆగష్టు: కోయిల్ సాగర్ ప్రాజెక్టులో తగినంత నీరు ఉన్నప్పటికీ కాలువలకు నీటిని విడుదల చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని బీఆర్ఎస్ నాయకులు మరికల్ మండల కేంద్రంలోని చౌరస్తా దగ్గర గురువారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లంబాడి తిరుపతయ్య మాట్లాడుతూ కోయిలసాగర్ నుంచి కుడి, ఎడమ కాలువలకు వెంటనే నీటిని విడుదల చేసి ఆయకట్టు పరిధిలోని పంటలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. వర్షాభావ పరిస్థితులతో ఇప్పటికే రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి పంటలను కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. సాగునీటి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే రైతులతో కలిసి మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే కోయిల్ సాగర్ నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మరికల్ మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీర బసంత్, కర్లి కృష్ణయ్య, కృష్ణారెడ్డి, రాజా రెడ్డి, గూప నర్సింహాలు, బీఆర్ఎస్ సర్పంచులు, వార్డ్ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.




## నేడు జి ఎస్ బి చారిటబుల్ ట్రస్ట్ సన్నాహక సమావేశం

**-ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం వసతి**

కామవరపుకోట: ఆగస్టు 13: మండలంలోని తడికలపూడి పంచాయతీ శివారు రత్నగిరి నగర్ లో జీఎస్ బి చారిటబుల్ ట్రస్ట్ సన్నాహక సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ గూడూరు వి ఎస్ ఆర్ ప్రసాద్ (ఇంజనీర్) తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్రంలోనే మరి ఎక్కడా లేని విధంగా తొలిసారిగా ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం వసతి సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం సమావేశానికి గూడూరు చారిటబుల్ ట్రస్ట్ మరియు కాకతీయ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొంటారని ప్రసాద్ తెలిపారు. రత్నగిరి నగర్ లో నిర్మించబోయే చారిటబుల్ ట్రస్ట్ నిర్మాణ శైలి, వివరాలు, వసతి విషయాలు, పిల్లలకు ఇచ్చే భరోసా మరియు ఇతర విషయాల గురించి చర్చించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా బుద్ధి మందగింపు, దివ్యాంగులకు సేవలు అందించేందుకు ట్రస్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది

**అక్రమాలపై నిలదీస్తే కేసులతో జైళ్లకు పంపుతున్నారు**

**ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టే ఇందుకు నిదర్శనం**

**వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం**

కర్నూలు,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో అమలువుతున్న 'రెడ్ బుక్ రాజ్యాంగం'పై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్, జైలుకు పంపిన తీరు రాష్ట్రంలో బాధితులే నిందితులుగా మారుతున్న దారుణ పరిస్థితికి అద్దం పడుతోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ అన్యాయాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తూ, చివరకు ఎమ్మెల్యేల ఇళ్లను కూడా ధ్వంసం చేసి అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఈ కుట్రల పాలన సాగుతోందని జగన్ విమర్శించారు. రాత్రి 2:45 గంటల సమయంలో వందల మంది పోలీసులు దొంగల్లా, బందిపోటు ముఠాలా వచ్చి ఎమ్మెల్యే విరూపాక్షి ఇంటి డోర్లు, సీసీ కెమెరాలను ధ్వంసం చేసి ఆయనను అపహరించుకుపోయారని ఆరోపించారు. పగటిపూట నోటీసులు ఇస్తే రాని ఉగ్రవాదా ఆయన అని ప్రశ్నించారు. గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యేపై మూడు అక్రమ కేసులు పెట్టడమే కాకుండా ఆయన కుమారుడు, తమ్ముడు, తమ్ముడి కుమారుడిని కూడా ఈ కేసుల్లో ఇరికించారని మండిపడ్డారు. ఆగష్టు 1న సంగాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గిరిపై దాడి జరుగు తుంటే, ఆయన రక్షణ కోసం ఎమ్మెల్యే విరూపాక్షి మానవత్వంతో అక్కడికి వెళ్లడమే నేరమన్నట్లు పోలీసులు వ్యవహరించారని జగన్ తెలిపారు. స్థానిక ఎస్సై, సీఐలకు ఫోన్ చేసినా పోలీసులు కాపాడక పోవడంతోనే ఎమ్మెల్యే స్వయంగా



వెళ్లాల్సి వచ్చిందన్నారు. ఆ తర్వాత నెమకల్లు వద్ద ఎమ్మెల్యేపై దాడి చేసి, ఆయన తమ్ముడి చెయ్యి విరగ్గొట్టారని వెల్లడించారు. ఈ నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఒక టీడీపీ కార్యకర్త తన భార్య బట్టలు తానే చించి, ఆ నెపం ఎమ్మెల్యేపై నెట్టి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు కూడా బయటకు వచ్చాయని, సదరు మహిళతో తప్పుడు మాటలు చెప్పిస్తూ ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్నారని, ఈ అక్రమాలపై ప్రజాస్వామ్యవాదులంతా ఆలోచించాలని జగన్ పిలుపునిచ్చారు.

## ఈనెల 23న చలో హైదరాబాద్ గోడపత్రికలు ఆవిష్కరణ

పెబ్బేరు,ఆగస్టు 12 (డీప్ పల్స్)సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం(ఓపిఎస్) పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర సిపిఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలోఈనెల 23న చలో హైదరాబాద్ గోడపత్రికలను పలు కార్యాలయాలలో గురువారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగ జీవితమంతా ప్రభుత్వ సేవకు అంకితం చేసిన తర్వాత పదవీ విరమణ సమయంలో ఆర్థిక భద్రత, జీవితానికి పాత పెన్షన్ విధానమే మార్గమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంపీడీవో రోజా, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జయచంద్ర, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ తూర్పుంటి నరేష్ కుమార్, హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు నరసింహ గౌడ్, జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, ప్రధాన కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్,, చిన్న రాములు, నరసింహనాయుడు, దయానంద్, దుర్గాప్రసాద్, రవి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బారువలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' వేడుకలు

బారువ, ఆగష్టు 13: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ఘనంగా జాతీయ పతాకాల ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.డి రామారావు గారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎన్.ఎస్.ఎస్. (చీఫ్) యూనిట్-1 ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీమతి స్నేహలత పల్లి మరియు యూనిట్-2 ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీ తెప్పల రాజేంద్ర ప్రసాద్‌లు ఆధ్వర్యం వహించారు.ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని, చేతిలో జాతీయ జెండాలతో బారువ వీధుల్లో దేశభక్తి నినాదాలు చేస్తూ ఘనంగా ర్యాలీ నిర్వహించారు. దేశ స్వాతంత్ర్య వజ్రోత్సవాల స్ఫూర్తిని చాటుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగరేయాలని ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కాటారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా తెప్పల దేవేందర్ రెడ్డి

కాటారం (భూపాలపల్లి) ఆగస్టు 13: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం డివిజన్ పరిధిలోని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను నియమిస్తూ టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కాటారం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా తెప్పల దేవేందర్ రెడ్డిని నియమించారు. మహాముత్తారం మండలం జాడి రాజయ్య, మహాదేవపూర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కటకం అశోక్, పలిమల మండల అధ్యక్షులుగా దండెర రాజేందర్, మల్హర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా జంగిడి శ్రీనివాసులను నియమించారు. వీరి నియామకం పట్ల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.



## పార్టీ కోసం కృషికి గుర్తింపు.. ఐలి ప్రసాద్‌కు మరోసారి అధ్యక్ష పదవి

మంథని, ఆగస్టు 13 : మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఐలి ప్రసాద్ రెండోసారి నియమితులయ్యారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు ఆదేశాల మేరకు ఆయనకు మరోసారి మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు.



కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పార్టీ కార్యక్రమాలను ముందుండి నిర్వహిస్తూ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేయడంలో ఐలి ప్రసాద్ కీలకంగా వ్యవహరించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు మంథని మండలంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారని పార్టీ నాయకులు తెలిపారు. పార్టీ కోసం ఐలి ప్రసాద్ చేసిన కృషిని గుర్తించిన అధిష్టానం మరోసారి మండల అధ్యక్షుడిగా అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐలి ప్రసాద్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. ఐలి ప్రసాద్‌కు రెండోసారి మండల అధ్యక్ష బాధ్యతలు దక్కడంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# భారత్‌లో బ్యాడ్మింటన్‌కు కొత్త ఊపు

## స్వదేశంలో ప్రపంచ చాంపియన్‌షిప్..

### క్రీడకు మరింత ప్రాచుర్యం




న్యూఢిల్లీ: ఆగస్టు 13: నిజ నిర్ధారణ క్రీడా ప్రతినిధి: భారత్‌లో ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నిర్వహించడం దేశంలో క్రీడకు మరింత ప్రాచుర్యం తీసుకురావడంతోపాటు యువతలో స్ఫూర్తిని నింపుతుందని భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నారు. అంతర్జాతీయ స్థాయి పోటీలకు భారత్ వేదికగా నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. 2009లో హైదరాబాద్‌లో ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నిర్వహించినప్పుడు భారత బ్యాడ్మింటన్ పరిస్థితి ఇప్పటితో పోలిస్తే భిన్నంగా ఉండేదని గోపీచంద్ గుర్తుచేశారు. ప్రస్తుతం భారత షట్లర్లు ప్రపంచస్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తున్నారని తెలిపారు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత ఆటగాళ్లు ఇప్పటివరకు 14 పతకాలు సాధించారని, 2019లో పీవీ సింధు సాధించిన స్వర్ణం ప్రత్యేకమని చెప్పారు. సైనా నెహ్వాల్, పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్ వంటి క్రీడాకారులు ప్రపంచ వేదికపై భారత్‌కు గుర్తింపు తీసుకొచ్చారని గోపీచంద్ పేర్కొన్నారు. గతంతో పోలిస్తే దేశంలో బ్యాడ్మింటన్ పట్ల ఆసక్తి గణనీయంగా పెరిగిందన్నారు. ప్రస్తుత తరం ఆటగాళ్లు ప్రపంచ చాంపియన్‌గా నిలవాలనే లక్ష్యంతో క్రీడల్లోకి వస్తుండటం శుభపరిణామమని చెప్పారు. తన కుమార్తె గాయత్రి ఆటతీరుపైనా గోపీచంద్ సంతృప్తి వ్యక్తం చేశారు. కామన్వెల్త్ పతకం సాధించడంతోపాటు ఆల్ ఇంగ్లండ్ టోర్నీలో రెండుసార్లు సెమీఫైనల్‌కు చేరడం, డబుల్స్‌లో అత్యుత్తమ ర్యాంక్ సాధించడం గర్వంగా ఉందన్నారు. తాను ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌గా నిలిచాననే కారణంతో గాయత్రిపై ఎలాంటి ఒత్తిడి తీసుకురాలేదని, ఆమె తన ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. స్వదేశంలో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్ భారత బ్యాడ్మింటన్ భవిష్యత్తుకు మరింత బలమైన పునాది వేస్తుందని గోపీచంద్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచస్థాయి ఆటగాళ్లను ప్రత్యక్షంగా చూసే అవకాశం లభించడం వల్ల యువత, చిన్నారుల్లో బ్యాడ్మింటన్‌పై ఆసక్తి మరింత పెరుగుతుందని తెలిపారు.

# నిషేధం ముగిశాక ఐపీఎల్ ఆడుతా: హ్యారీ బ్రూక్




కోట్లు కురిపించే ఐపీఎల్‌కు దూరమైన హ్యారీ బ్రూక్ మనసు మార్చుకునేలా ఉన్నాడు. వేలంలో భారీ ధర పలికినా.. తీరా సీజన్ ఆరంభానికి ముందే వైదొలిగే అలవాటున్న బ్రూక్.. ఈసారి ఆ పొరపాటు చేయకూడదని భావిస్తున్నాడు. ఐపీఎల్‌లో తనపై రెండేళ్ల నిషేధం పూర్తయ్యాక.. మళ్లీ పునరాగమనం చేయడంపై ఆలోచిస్తానని చెప్పాడీ ఇంగ్లండ్ కెప్టెన్. ఇంగ్లండ్ వన్డే, టీ20 కెప్టెన్‌గా రాణిస్తున్న హ్యారీ బ్రూక్ ఐపీఎల్‌లో పునరాగమనం చేయడంపై ఆలోచిస్తున్నాడు. దేశం తరఫున మూడు ఫార్మాట్లలో అదరగొడుతున్న అతడు.. తాజాగా ఐపీఎల్‌పై స్పందించాడు. 'ఐపీఎల్ నిజంగా గొప్ప టోర్నమెంట్. అందులో ఆడడం నిజయంగా మర్చిపోలేని అనుభవం. ఐపీఎల్ ఆడితే మనలోని ఉత్తమ బ్యాటర్ బయటకొస్తాడు. ఐపీఎల్ నిజంగా మంచి పోటీనిచ్చే టోర్నీ. ఈ మెగా ఈవెంట్‌లో మళ్లీ ఆడడంపై ఆలోచిస్తా' అని బ్రూక్ వెల్లడించాడు.

# నాకు ప్రైవసీ కావాలి:

## లెస్బియన్ మొగుడు



ఆటతో పాటు వ్యక్తిగత జీవితంలో వివాదాలతోనూ ఇటీవల వార్తల్లో నిలుస్తోంది అష్లే గార్డ్‌నర్. ఏడాదికే వివాహ బంధం ముగియడం, గార్డ్‌నర్ తనను చీట్ చేసిందని భార్య ఆరోపించడంతో మీడియాలో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ పేరు మార్మోగింది. ఈ నేపథ్యంలో గార్డ్‌నర్ తొలిసారి స్పందించింది. తాను కష్టమైన దశలో ఉన్నానని, తనకు ప్రైవసీ కావాలని ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో అభ్యర్థించిందీ క్రికెటర్. ఇటీవల మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా విజయంలో కీలకమైన అష్లీ గార్డ్‌నర్ వ్యక్తిగత జీవితం మాత్రం వివాదాస్పదమైంది. నిరుడు భారత్ ఆతిథ్యమిచ్చిన వన్డే ప్రపంచకప్‌లో గార్డ్‌నర్ తనను చీట్ చేసిందని, మరో క్రికెటర్‌తో సన్నిహితంగా మెలిగిందని ఆమె భార్య మోనికా రైట్ ఆరోపించడమే అందుకు కారణం. వివాహ బంధం అర్ధాంతరంగా ముగియడం పట్ల తనపై మీడియాలో వస్తున్న కథనాలపై గార్డ్‌నర్ స్పందించింది. 'నా భార్యతో విడిపోవడం అనేది వ్యక్తిగత విషయం. క్రికెట్ ఆస్ట్రేలియా నన్ను వైస్ కెప్టెన్ చేసినందున నా రిలేషన్‌షిప్ గురించి బహిరంగంగా చెప్పాల్సిన అవసరముంది. నాఉక మద్దతుగా నిలిచి, బాధ్యతలు అప్పగించిన ఆసీస్ బోర్డుకు ధన్యవాదాలు. వచ్చే సీజన్లలో నేను గొప్ప ప్రదర్శన చేసి జట్టు విజయాల్లో కీలకం అవ్వాలనుకుంటున్నా. మోనిక, నేను కలిసి గడిపిన సమయానికి కృతజ్ఞురాలిని. కానీ, అదే బంధం చివరకు ఎంతో బాధకు కారణమైంది. ఈ పరిస్థితుల్లోనే తను సంతోషంగా ఉండాలని, విజయవంతం అవ్వాలని కోరుకుంటున్నా. ఈ అంశంపై నేను భవిష్యత్‌లో బహిరంగంగా కామెంట్లు చేయను. కాబట్టి.. నాకు ప్రైవసీ కావాలని మీ అందరికి తెలియజేస్తున్నా' అని గార్డ్‌నర్ వెల్లడించింది.



# నిప్పులు చెరిగిన హసన్

## 198కే ఆస్ట్రేలియా ఆలౌట్





వరల్డ్ నంబర్ 1 ఆస్ట్రేలియాకు బంగ్లాదేశ్ పేసర్ హసన్ మహమూద్(6-55) వణుకు పుట్టించాడు. 23 ఏళ్ల తర్వాత ఆసీస్ గడ్డపై టెస్టు మ్యాచ్ ఆడుతున్న బంగ్లాకు భరోసానిస్తూ.. ఈ స్పీడ్‌స్టర్ వికెట్ల వేటతో ఆసీస్‌ను పడగొట్టాడు. స్టీవ్ స్మిత్(71) ఒంటరి పోరాటం చేసినా.. మహమూద్ అత్యుత్తమ గణాంకాలు నమోదు చేయడంతో కంగారూ టీమ్ కోలుకోలేకపోయింది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లా ఇంకా వెనకబడి ఉంది. ప్రపంచ నంబర్ 1 టెస్టు టీమ్ ఆస్ట్రేలియా తడబడింది. సొంతగడ్డపై చెలరేగే ఆసీస్ బ్యాటర్లు బంగ్లాదేశ్ పేస్ దళానికి దాసోహమయ్యారు. డార్విన్ స్టేడియంలో హసన్ మహమూద్(6-55) ఆరు వికెట్లతో రెచ్చిపోగా ఆతిథ్య జట్టు ఇన్నింగ్స్ నత్తనడకలా సాగింది. సహచరులు ఇలా వచ్చి అలా వెళ్లగా.. స్టీవ్ స్మిత్(71) క్రీజునంటుకున్నాడు. కానీ, స్కోర్ మాత్రం రెండొందలు దాటించలేకపోయాడు. తస్కిన్(2-55), హసేన్(2-39)లు సైతం విజృంభించగా కంగారూ టీమ్ 198 పరుగులకేకుప్పకూలింది. ఆస్ట్రేలియాను స్వల్ప స్కోర్‌కే పరిమితం చేసిన బంగ్లాదేశ్ బౌలర్ల నమ్మకాన్ని బ్యాటర్లు నిలబెట్టారు. పటిష్టమైన కంగారూ బౌలింగ్ దళాన్ని ఎదుర్కొన్న ఓపెనర్లు శుభారంభమిచ్చారు. షద్మాన్ ఇస్లాం(20)ను మిచెల్ స్టార్క్ ఔట్ చేసి ఆసీస్‌కు తొలి వికెట్ అందించాడు. అనంతరం మొమినుల్ హక్(35 నాటౌట్), తంజిద్ హసన్ తమీమ్(32 నాటౌట్)లు ఆచితూచి ఆడారు. ఫలితంగా మొదటి రోజు ఆట ముగిసే సరికి బంగ్లాదేశ్ వికెట్ నష్టానికి 96 పరుగులు చేసింది. ఇంకా తొలి ఇన్నింగ్స్‌లో పర్యాటక జట్టు 102 పరుగులు వెనకబడి ఉంది.

# మిచెల్ స్టార్క్ ప్రపంచ రికార్డు

### టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన లెఫ్ట్ ఆర్మ్ బౌలర్




ఆస్ట్రేలియా వెటరన్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన ఎడమచేతి వాటం బౌలర్‌గా చరిత్రకెక్కాడు. ఈ క్రమంలో శ్రీలంక దిగ్గజ స్పిన్నర్ రంగనా హెరాత్ (433) రికార్డును అధిగమించాడు. బంగ్లాదేశ్‌తో డార్విన్‌లోని మరారా క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న తొలి టెస్టులో ఈ అరుదైన ఘనతను అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఓపెనర్ షాద్మాన్ ఇస్లామ్‌ను ఔట్ చేయడం ద్వారా స్టార్క్ తన టెస్టు వికెట్ల సంఖ్యను 434కి పెంచుకున్నాడు. తన 106వ టెస్టులో ఈ మైలురాయిని చేరుకున్న స్టార్క్, భారత క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ (434 వికెట్లు) రికార్డును సమం చేశాడు. ప్రస్తుతం టెస్టుల్లో ఆల్-టైమ్ వికెట్ టేకర్ల జాబితాలో 10వ స్థానంలో ఉన్న దక్షిణాఫ్రికా పేస్ దిగ్గజం డేల్ స్టెయిన్ (439) రికార్డును బద్దలు కొట్టడానికి స్టార్క్ కేవలం ఆరు వికెట్ల దూరంలో ఉన్నాడు. ఈ రికార్డుతో ఎడమచేతి వాటం బౌలర్ల జాబితాలో స్టార్క్ అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు. రంగనా హెరాత్ (433), పాకిస్థాన్ గ్రేట్ వసీం అక్రమ్ (414), న్యూజిలాండ్ స్పిన్నర్ డానియల్ వెటోరి (362), శ్రీలంక పేసర్ చమిందా వాస్ (355) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. భారత ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 348 వికెట్లతో ఈ జాబితాలో ఆరో స్థానంలో కొనసాగుతున్నాడు. అయితే, వ్యక్తిగత రికార్డులపై తాను పెద్దగా దృష్టి పెట్టనని, జట్టు ప్రయోజనాలే ముఖ్యమని ఈ సిరీస్‌కు ముందు స్టార్క్ పేర్కొన్నాడు. ఐసీసీ కథనం ప్రకారం.. "ఇలాంటి దిగ్గజాల సరసన నా పేరు వినిపించడం గౌరవంగా ఉంది. కానీ, ఆడుతున్నప్పుడు ఈ గణాంకాలకు పెద్దగా ప్రాధాన్యం ఉండదు" అని స్టార్క్ తెలిపాడు. కాగా, స్టార్క్ ఈ చారిత్రక ఘనత సాధించిన రోజే ఆస్ట్రేలియా జట్టు బ్యాటింగ్‌లో ఘోరంగా విఫలమైంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్, బంగ్లాదేశ్ బౌలర్ల ధాటికి కేవలం 198 పరుగులకే కుప్పకూలింది. బంగ్లా బౌలర్ హసన్ మహమూద్ 55 పరుగులిచ్చి 6 వికెట్లతో కెరీర్ బెస్ట్ ప్రదర్శన చేశాడు. ఆసీస్ తరఫున స్టీవ్ స్మిత్ (71) ఒక్కడే పోరాడాడు.

# సీఎస్కే కోచ్‌గా ధోనీయే కరెక్ట్: అశ్విన్

ఐపీఎల్ 2026 సీజన్‌లో నిరాశాజనక ప్రదర్శన తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టు హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌తో తమ బంధాన్ని ముగించుకున్న సంగతి తెలిసిందే. అప్పటి నుంచి సీఎస్‌కే తదుపరి కోచ్ ఎవరనే దానిపై తీవ్రమైన చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో టీమిండియా సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో ఆసక్తికర విశ్లేషణ చేశాడు. ఇంగ్లండ్‌కు వన్డే ప్రపంచకప్ అందించిన మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్, సీఎస్‌కే కొత్త హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశాలున్నాయని జోస్యం చెప్పాడు. మోర్గాన్‌కు ఉన్నత స్థాయిలో కోచింగ్ అనుభవం లేనప్పటికీ, అతను ఈ పదవికి బలమైన పోటీదారుడని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. "నాకు ఎందుకో ఇయాన్ మోర్గాన్ వస్తాడని అనిపిస్తోంది. అతని పేరు బలంగా వినిపిస్తోంది. ఇప్పటికే తొలి దశ చర్చలు జరుగుతున్నాయనడంలో సందేహం లేదు. అయితే, మోర్గాన్ ఈ ఏడాదే బాధ్యతలు తీసుకుంటాడా? లేక మినీ వేలంలో మరొకరు జట్టును నిర్మించిన తర్వాత అతడు వస్తాడా? అనేది చూడాలి" అని అశ్విన్ తెలిపాడు. 2019లో ఇంగ్లండ్‌కు ప్రపంచకప్ అందించడం, 2021లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను కెప్టెన్‌గా ఫైనల్ చేర్చడం మోర్గాన్‌కు కలిసివచ్చే అంశాలని పేర్కొన్నాడు.

# గంభీర్ కొనసాగింపునకే బీసీసీఐ మొగ్గు



టీమిండియా హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ పదవికి వచ్చిన ముప్పేమీ లేదని, అతడు ప్రస్తుతానికి సురక్షితంగానే ఉన్నారని తెలుస్తోంది. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో జట్టు వైఫల్యాలు, అంతకుముందు స్వదేశంలో టెస్టు సిరీస్‌లలో ఎదురైన పరాజయాలతో గంభీర్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అయినప్పటికీ బీసీసీఐ గౌతీకి అండగా నిలుస్తున్నట్లు సమాచారం. గంభీర్‌ను కోచ్ పదవి నుంచి తొలగించకపోవడానికి ప్రధానంగా రెండు కారణాలు కనిపిస్తున్నాయి. గతంలో న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా జట్లతో స్వదేశంలో జరిగిన టెస్టు సిరీస్‌లలో టీమిండియా ఘోర పరాజయాలు చవిచూసింది. దీనికి తోడు ఇటీవల పరిమిత ఓవర్ల క్రికెట్‌లోనూ జట్టు ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదు. ఈ నేపథ్యంలో 2027 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు అర్హత సాధించడం భారత్‌కు కష్టతరంగా మారింది. దీంతో సోషల్ మీడియాలో గంభీర్‌ను తొలగించాలనే డిమాండ్లు ఊపందుకున్నాయి. అయితే, బోర్డు వర్గాలు మాత్రం భిన్నంగా ఆలోచిస్తున్నట్లు స్పష్టమవుతోంది. టెస్టు జట్టు ప్రస్తుతం ఒక పరివర్తన దశలో ఉందని బీసీసీఐ భావించడమే ఇందుకు మొదటి కారణం.

# వయసు కాదు.. ఆటే మ్యాటర్: హర్భజన్

వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్‌లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆడడంపై ఇంకా స్పష్టత లేదు. దిగ్గజాలైన ఇద్దరిని మెగా టోర్నీలో ఆడించాలనే డిమాండ్లు వస్తున్నా సెలెక్టర్లు, బీసీసీఐ మాత్రం ఏదీ తేల్చట్లేదు. అయితే.. పలువురు మాజీ ఆటగాళ్లు విరాట్, రోహిత్ అనుభవం భారత్‌కు కలిసొస్తుందని వాదిస్తున్నారు. తాజాగా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ సైతం ఈ వెటరన్స్‌కు వరల్డ్‌కప్ స్క్వాడ్‌లో చోటు కల్పించాలని డిమాండ్ చేశాడు. భారత జట్టుకు దశాబ్దాలుగా సేవలందిస్తున్న విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు వన్డే వరల్డ్‌కప్ ఆడాలని భావిస్తున్నారు. వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్న ఈ స్టార్ ద్వయం..మెగా ఈవెట్‌తో వీడ్కోలు పలికే అవకాశాలున్నాయి. అయితే.. వయసు 35 ప్లస్ దాటడంతో వీరిని పక్కనపెట్టి.. కుర్రాళ్లను తీసుకోవాలనే ప్రయత్నాల్లో ఉన్నారు సెలెక్టర్లు. కానీ, అనుభవజ్ఞులైన



ఇద్దరినీ ఆడించాలని మాజీలు అభిప్రాయపడుతుండగా.. పీటీఐ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో హర్భజన్ సింగ్ మాట్లాడుతూ.. వరల్డ్‌కప్ కోసం ఆటగాళ్ల ఎంపికలో నిలకడ కొలమానం కావాలని అన్నాడు. 'ఆటగాళ్ల వయసు ముఖ్యం కాదు. వారు పరుగులు సాధిస్తున్నారా? నిలకడ ఉందా? అనేవి మాత్రమే చూడాలి. వచ్చే ఏడాది వరల్డ్‌కప్ సమయానికి కోహ్లీకి 39 ఏళ్లు, రోహిత్‌కు నలభై వస్తాయి. ఫిట్‌నెస్‌లో రారాజైన విరాట్ ఇప్పటకీ మైదానంలో 20 ఏళ్ల కుర్రాళ్లతో పోటీపడగలడు. లియోనల్ మెస్సీని తీసుకోండి.. అతడికి 39. అయినా.. ఫిఫా వరల్డ్‌కప్‌లో మెరిశాడు. ఫిట్‌గా ఉన్న అతడిని మైదానంలో ఐదుగురు ప్రత్యర్థులు కూడా అడ్డుకోలేరు. వయసు కంటే నైపుణ్యమే పరిగణనలోకి తీసుకోవాలి. ట, ఫిట్‌నెస్‌లో కోహ్లీ, విరాట్ అదరగొడుతున్నప్పుడు.. శ్రేయాస్ అయ్యర్, యశస్వీ జైస్వాల్ అవసరం ఉండదుగా. అలానే.. పదిహేనేళ్ల వైభవ్ సూర్యవంశీ నుంచి ఎక్కువగా ఆశించడం పొరపాటే అవుతుంది. కోహ్లీ, రోహిత్‌కు మూడొందల మ్యాచ్‌ల అనుభవుమంది. కాబట్టి.. వీరిని ఆడించడం టీమిండియాకు మంచిది' అని భజ్జీ పేర్కొన్నాడు.

లస్యూరి చిత్రం






# వేగం పెంచిన రజనీకాంత్ 'ధర్మన్'

సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా, దర్శకుడు అశ్వత్ మరిముత్తు తెరకెక్కిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ధర్మన్' సినిమా షూటింగ్ వేగం పుంజుకుంది. ఈ చిత్రం రెండో షెడ్యూల్ చిత్రీకరణ నేడు ప్రారంభమైనట్టు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాను సీనియర్ నటుడు కమల్ హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న విషయం తెలిసిందే. షూటింగ్ ప్రారంభంపై చిత్ర నిర్మాణ సంస్థ సోషల్ మీడియా వేదికగా ఒక ప్రత్యేక వీడియో క్లిప్‌ను పంచుకుంది. "ది డెడ్లీ డాక్టర్.. 'ధర్మన్' షెడ్యూల్ 2 మొదలైంది, ఇది ఒక లెజెండరీ" అంటూ పోస్ట్ చేసింది. విడుదల చేసిన వీడియోలో సూపర్ స్టార్ రజనీకాంత్ సెట్స్‌లో ఉండగా, దర్శకుడు అశ్వత్ మరిముత్తు ఆయనతో చర్చిస్తున్న దృశ్యాలు కనిపించాయి. ఈ అప్‌డేట్‌తో అభిమానుల్లో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ ప్రాజెక్ట్ ప్రకటించినప్పటి నుంచి సినిమాపై భారీ ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది జూన్‌లో చిత్ర యూనిట్ ఒక మేకింగ్ వీడియోను విడుదల చేసింది. అందులో సినిమా కోసం రజనీకాంత్ లుక్‌ను ఎలా ఫైనల్ చేశారో చూపించారు. దర్శకుడు అశ్వత్ మరిముత్తు సైతం "ఇదే హెయిర్ స్టైల్, ఇదే లుక్" అంటూ రజనీ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. అంతకుముందు "ది ఓజీ స్వాగ్" పేరుతో విడుదలైన మరో వీడియోలో ఫస్ట్ లుక్ కోసం రజనీకాంత్ కాస్ట్యూమ్స్, యాక్సెసరీస్ ఎంపిక చేసే విధానాన్ని, కమల్ హాసన్ కూడా సెట్స్‌కు వచ్చి రజనీతో ముచ్చటించడం వంటి సన్నివేశాలు చూపించారు. ఈ చిత్రంలో రజనీకాంత్ ఒక డాక్టర్‌గా నటిస్తూ, సమాజంలోని నేరస్థులను ఎదుర్కొనే పాత్రలో కనిపించనున్నారు. గతంలో సినిమా టైటిల్ ప్రకటిస్తూ కమల్ హాసన్ "ధర్మమే వెల్లుమ్!" (ధర్మమే గెలుస్తుంది) అని ట్వీట్ చేశారు. విడుదలైన టైటిల్ పోస్టర్‌లో రజనీకాంత్ ఆపరేషన్ థియేటర్‌లో స్కాల్‌పెల్ పట్టుకుని, ఒక రౌడీ షీటర్ శరీరంపై కాలు వేసి నిలబడినట్టుగా కనిపించడం సినిమాపై క్యూరియాసిటీని పెంచింది.




# ఎన్టీఆర్‌కు విజయవంతంగా భుజం శస్త్రచికిత్స

హైదరాబాద్, ఆగస్టు 13:ప్రముఖ సినీ నటుడు, యంగ్‌టైగర్ ఎన్టీఆర్‌కు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో భుజానికి శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. ఇటీవల భుజానికి గాయం కావడంతో వైద్యుల సూచన మేరకు ఆయనకు ఆర్థ్రోస్కోపిక్ సర్జరీ నిర్వహించారు. శస్త్రచికిత్స అనంతరం ఎన్టీఆర్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆగస్టు 13న ఆయనను ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. ఇకపై వైద్యుల పర్యవేక్షణలో పునరావాస చికిత్స కొనసాగించనున్నారు. పూర్తిగా కోలుకునేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉందని వైద్యులు సూచించారు. తన ఆరోగ్యంపై అభిమానులు, శ్రేయోభిలాషులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎన్టీఆర్ తెలిపారు. తన కోసం ప్రార్థించిన అభిమానులు, కుటుంబసభ్యులు, స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్టీఆర్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

# ఫోన్ వల్లే సర్జరీ: షకీలా

గంటల తరబడి స్మార్ట్‌ఫోన్‌కు అతుక్కుపోవడం ఎంత ప్రమాదకరమో చెప్పడానికి సీనియర్ నటి షకీలా ఉదంతం ఒక హెచ్చరికగా నిలుస్తోంది. ఫోన్ వ్యసనం కారణంగా తీవ్రమైన నరాల సమస్య బారిన పడిన ఆమె, ఇటీవల మెడకు అత్యవసర శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ చేదు అనుభవాన్ని ఆమె స్వయంగా వెల్లడిస్తూ, స్మార్ట్‌ఫోన్ వినియోగదారులను అప్రమత్తం చేశారు. గత కొంతకాలంగా తాను మంచంపై తప్పుడు భంగిమలో పడుకుని గంటల తరబడి ఫోన్‌లో రీల్స్ చూడటం, గేమ్స్ ఆడటమే అలవాటుగా మార్చుకున్నానని షకీలా తెలిపారు. కేవలం టీ, కాఫీ తాగేందుకు మాత్రమే విరామం తీసుకుని, మిగతా సమయమంతా ఫోన్‌తోనే గడిపానని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దురలవాటు కారణంగా మెడలోని ప్రధాన నరాలపై తీవ్ర ఒత్తిడి పడి, సమస్య జటిలమైందని వివరించారు. చివరికి ఈ అలవాటే తనను ఆపరేషన్ టేబుల్ వరకు తీసుకెళ్లిందని ఆమె వాపోయారు. ఈ మేజర్ సర్జరీ కోసం సుమారు రూ. 3 లక్షలు ఖర్చయిందని, శారీరకంగా తాను భరించలేని నరకాన్ని అనుభవించానని షకీలా కన్నీటిపర్యంతమయ్యారు. ప్రస్తుతం కనీసం మంచం దిగాలన్నా, ఆహారం తినాలన్నా ఇతరుల సహాయం తీసుకోవాల్సిన దీనస్థితిలో ఉన్నానని చెప్పారు. తన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ గుణపాఠం నేర్చుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె స్మార్ట్‌ఫోన్ వినియోగదారులకు గట్టి హెచ్చరిక జారీ చేశారు. "దయచేసి ఎవరూ ఫోన్‌ను అతిగా వాడి ఆరోగ్యం పాడుచేసుకోవద్దు. స్క్రీన్ టైమ్ తగ్గించుకోండి" అని సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలను స్మార్ట్‌ఫోన్లు, ఇతర గాడ్జెట్లకు దూరంగా ఉంచాలని, లేదంటే భవిష్యత్తులో వారు కూడా తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



# రజనీకాంత్‌తో అలా..!: శ్రియ శరణ్



టాలీవుడ్, కోలీవుడ్ తార నటి శ్రియ శరణ్, సూపర్ స్టార్ రజనీకాంత్‌తో నటించిన 'శివాజీ: ది బాస్' సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. శ్రియ కెరీర్ లోనే అత్యధిక కలెక్షన్స్ సాధించిన చిత్రాలలో ఒకటిగా నిలిచింది. అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ఒక మధురమైన జ్ఞాపకాన్నిశ్రియ తాజాగా పంచుకున్నారు. దర్శకుడు శంకర్ తనకు ఆ అవకాశం ఇచ్చిన వైనం గురించి ఆమె మాట్లాడుతూ..ఒకరోజు శంకర్ సర్ నాకు ఫోన్ చేసి, 'ఒక సినిమా ఉంది, అందులో పనిచేస్తావా?' అని అడిగారు. నేను సరేనని చెప్పాను, ఆయన 'సరే' అన్నారు. నేను అక్కడికి వెళ్లేసరికి చాలా మంది ప్రముఖులు వచ్చారు. ఎ.ఆర్. రెహమాన్ సర్, రజనీకాంత్ సర్ వచ్చారు. అప్పుడు నేను శంకర్ గారిని చూసి, 'ఇది కచ్చితంగా చాలా పెద్ద సినిమా అయి ఉంటుంది' అనుకున్నాను, ఎందుకంటే అక్కడ అంత పెద్ద వాళ్ళంతా గుమిగూడారు. అప్పుడు ఆయన నన్ను చూసి, 'మీ కో-స్టార్ రజనీకాంత్ సర్‌ని కలవండి' అని చెప్పారు.

## శర్వానంద్-శ్రీను వైట్ల కాంబో..

# టార్గెట్ సంక్రాంతి



టాలీవుడ్‌లో ఒక ఆసక్తికరమైన కాంబినేషన్ పట్టాలెక్కబోతోంది. చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా, ఎంటర్‌టైన్‌మెంట్ చిత్రాల దర్శకుడు శ్రీను వైట్ల దర్శకత్వంలో ఒక కొత్త సినిమా లాంఛనంగా ప్రారంభం కానుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డైనమిక్ ప్రొడ్యూసర్ అనిల్ సుంకర ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూజా కార్యక్రమాలు శుక్రవారం (ఆగస్టు 14) ఉదయం 9:45 గంటలకు జరగనున్నాయి. ఈ మేరకు చిత్ర బృందం ఒక అధికారిక పోస్టర్‌ను విడుదల చేసి ఈ విషయాన్ని ప్రకటించింది. ప్రస్తుతం ఈ చిత్రానికి వర్కింగ్ టైటిల్‌గా ఎస్ఎస్ఎస్1 అని నామకరణం చేశారు. ఈ టైటిల్‌కు శర్వా, శ్రీను, సుంకర అనే ముగ్గురి పేర్లలోని మొదటి అక్షరాలను సూచికగా చూపడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. పోస్టర్‌పై "సైన్స్, సెన్స్, సక్సెస్" అనే ట్యాగ్‌లైన్‌ను కూడా జోడించారు. దీంతో శ్రీను వైట్ల తన మార్క్ కామెడీకి సైన్స్ అంశాలను కూడా జోడించి ఒక కొత్త తరహా కథతో వస్తున్నారా అనే చర్చ మొదలైంది. చాలా కాలంగా సరైన విజయం కోసం ఎదురుచూస్తున్న శ్రీను వైట్ల, ఈ సినిమాతో గ్రాండ్‌గా కమ్‌బ్యాక్ ఇవ్వాలని పట్టుదలతో ఉన్నారు. మరోవైపు, విభిన్నమైన కథలను ఎంచుకునే శర్వానంద్ ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సినిమాపై అంచనాలను పెంచుతోంది.

## తారక్ లేకున్నా 'డ్రాగన్' షూటింగ్

టాలీవుడ్ అగ్ర కథనాయకుడు యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'డ్రాగన్' షూటింగ్‌కు సంబంధించి ఒక లేటెస్ట్ అప్‌డేట్ వచ్చేసింది. ఇటీవలే ఎన్టీఆర్ సర్జరీ విజయవంతంగా పూర్తి కావడంతో, ఈ సినిమా షూటింగ్ సెప్టెంబర్ 3 నుంచి తిరిగి ప్రారంభం కానున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై చిత్రయూనిట్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. భూజానికి జరిగిన సర్జరీ అనంతరం ఎన్టీఆర్ ప్రస్తుతం రెస్ట్ తీసుకుంటున్నప్పటికీ, సినిమా షూటింగ్‌లో ఎలాంటి బ్రేక్ ఉండకూడదని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 3 నుంచి మొదలయ్యే షెడ్యూల్‌లో టాకీ పార్ట్ తో పాటు చిన్ననాటి సన్నివేశాలను డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తెరకెక్కించబోతున్నారు.



# గిరిజన అమ్మాయిగా జాన్వీ



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం తన తదుపరి సినిమాతో బిజీగా ఉన్నారు. 'జవాన్' ఫేమ్ అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సన్ పిక్చర్స్ సంస్థ ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అల్లు అర్జున్ కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌లలో ఒకటిగా భావిస్తున్న ఈ సినిమాకు సంబంధించి కథ, పాత్రలు, కాస్టింగ్ విషయంలో ఎప్పటికప్పుడు ఆసక్తికరమైన వార్తలు బయటకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ పాత్రకు సంబంధించి ఓ కొత్త ప్రచారం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమాలో జాన్వీ కపూర్ కీలక పాత్రలో కనిపించనున్నారని గత కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. అయితే ఆమె పాత్రకు సంబంధించి ఇప్పటివరకు చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రాలేదు. తాజాగా వస్తున్న కథనాల ప్రకారం.. జాన్వీ కపూర్ ఈ సినిమాలో ఒక ట్రైబల్ క్వీన్ (గిరిజన రాణి) పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. ఆమె పాత్ర కేవలం గ్లామర్ కోసం మాత్రమే కాకుండా కథలో చాలా కీలకంగా ఉంటుందని ప్రచారం జరుగుతోంది.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467